# ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్!

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

'అవును నేను మీ భార్యనే అదికాదంల్లేదు, కాని నేను బానిసను మాత్రం కాను. ప్రతి క్షణం మీరు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెపుతూ వుంటం, మీరనే మాటలు పడుతూవుంటానికి ఇక్కడ-నేను మట్టిబొమ్మను కాను...'

'అయితే నన్ను ఇన్‌సల్ట్ చేస్తూ వుంటే మాత్రం పల్లెత్తి ఒక్కమాట అనవు...'

'మా అమ్మా నాన్న అనే మాటలకు నేనా బాధ్యురాలిని. వాళ్ళని మిమ్మల్ని ఏమన్నా అనమన్నానా! వాళ్ళంటున్న మాటల్ని యెప్పుడైనా నేను హర్షించానా! సపోర్ట్ చేశానా! నేను చేసిన తప్పల్లా, వాళ్ళకు ఎదురుచెప్పలేకపోవటమే...'

'అవును నిజమే వాళ్ళకు ఎదురుచెప్పలేక పోయినావు కాని నాకు ఎదురు చెప్పటం అవుతే నీకు బాగా అలవాటైపోయింది.'

'నేను ఎంత సహనం పట్టానో, ఎంత ఓపిక పట్టానో, అది మీకేమి అక్కర్లేదు. ఇవ్వాళ నేను నోరువిప్పి నా బాధ చెపుతుంటే ఎదురుచెపుతున్నట్టుగానే మీరు భావిస్తున్నారు. దాంట్లో ఎవరి తప్పు యేమీ లేదు.'

'నాకేం తెలీటంలా ... ఓ వారం రోజులు మీరు వెళ్ళమన్నారు గదా అని మా వాళ్ళింటికి వెళితే వాళ్ళడిగిన ప్రశ్నలకు నా మతి పోయింది. మిమ్మల్ని గురించి ఎన్నెన్నో ప్రశ్నలు వేశారు. వాటికి సమాధానాలు ఏం చెప్పాలో నాకు తెలీనేతెలీలేదు. ఉక్కిరిబిక్కిరయిపోయింది నాపని. నా మనస్సంతా వికలమయిపోయింది.'

'ఇక్కడ నా దగ్గర అంటున్న మాటలా యివి...'

'అక్కడోమాట ఇక్కడోమాట చెప్పే అలవాటు నాకు లేదు ... కచ్చితంగా చెప్పేశా, ఈసారి ఆయన వచ్చినప్పుడు ఆయన్నే అడిగి తెలుసుకోండి అని గట్టిగానే అందామనుకున్నా, కాని వాళ్ళకు కోపం వస్తుందేమోనని తమాయించుకున్నా, వాళ్ళనబోయే మాటలు కూడా నాకు తెలుసు. అందుకనే నోరు మూసుకుని వాళ్లనే మాటలన్నీ నిశ్శబ్దంగా వింటూ 'అవును నేనేం చేస్తాను. నా మాట ఆయన వింటారా' అని వూరుకున్నాను. కాస్తంత ఆమాత్రం కూడా నే ననకపోతే నామీద విరుచుకుపడతారు.'

'అదే పాలిసీ యిక్కడా ఎడాప్ట్ చేస్తున్నావన్నమాట...'

'అంటే...'

'వాళ్లదగ్గరేమో నేను నీ మాట విన్నని. ఇక్కడేమో వాళ్లు నీమాట వినరని...'

'దీంట్లో అబద్ధమేముంది. రెండూ నిజమేనా...'

'ఆ రెండూ నిజమేనా...'

'అ రెండూ నిజమే మున్మాటికీను...'

'సరే అట్లా అవుతే నన్నేం చెయ్యమంటావో చెప్పు...'

'నా వ్యక్తిత్వాన్ని అభిమానించండి. మీరు చేసే ప్రతి పనికి నేను అండగా నిలబడతాను. ఎవరేంచెప్పినా, దాంట్లో యేదైనా సబబు వుందేమో గ్రహించటానికి ప్రయత్నం చెయ్యండి. ఎవరు చెప్పారు అనే మాట అనవసరం. మా వాళ్ళు చెప్పినా సరే...'

'మీవాళ్లు కోరేది ఒకటేగా, వాళ్లకు డబ్బున్నది కాబట్టి, గౌరవమర్యాదలు వాళ్లకే వుంటాయని, వాళ్ళు చెప్పినట్టు నే నడుచుకోవాలని అంతేగా...!'

'కష్టపడి పనిచెయ్యటంలో గౌరవమూ వుంది, సంతృప్తీ వుందంటారు, అదెప్పుడూ నేను కాదన్లేదే. అయితే వచ్చిన సదుపాయాలను, అవకాశాలను, ఫాల్స్‌ప్రెస్టేజ్ పెట్టుకుని వదులుకుంటే, అదొక గొప్పతనమా...'

'...అదుగో మళ్లా మీరు ఉద్రేకపడుతున్నారు...' ఇన్నెందుకు మీ యిద్దరూ బాగానే వున్నారు. మధ్యలో నేనెందుకు నలిగిపోవటం. నాకు మీరు ముఖ్యం. వాళ్ళూ అంతే. పెళ్లయినంత మాత్రాన మా వాళ్లను మానంచేసుకుని, వాళ్లను చులకనచేసి, నాకు చేసిన ఉపకారము, మేలు అన్నీ మరిచిపోయి, కృతఘ్నురాలుగా వుంటే అది నాకు గౌరవమా! ... పెళ్లయిన తర్వాత మన యిల్లు, మన వాకిలి, మన సంపాదన చూసుకోవాల్సిందే. మన సంసారం మన కుటుంబం వేరు. దీన్ని చూసుకోవాల్సిన బాధ్యత నాది. దాంట్లోనే ఆనందం వుంది. జీవిత పరమార్థం వుంది. ఇది నేను మరిచిపోవటంలేదు...' కాస్తంత ఉద్రేకంగానే అన్నది.

'మరి తగాదా ఇప్పుడేముందని...'

'తగాదా వుందని యెవరన్నారు కనక.. ఏదో కారణంగా అక్కడో మాట యిక్కడోమాట తీసి నన్ను దెప్పిపొడుస్తూవుంటే, యింత రాద్ధాంతం వచ్చింది.'

'అప్పుల్లే ఓ మూల ఆఫీసు టైమవుతోంది. ఇట్లా నీతో పెట్టుకుకూర్చుంటే గంటలే కాదు రోజులే గడిచిపోతాయి. వంటసంగతేమిటో చూడు...'

'వంట యెప్పుడో అయింది. మీదే ఆలస్యం భోజనానికి రావటం...'

.........

'సరేగానిండి సాయంత్రం ఏదో గుడ్ న్యూస్ తీసుకురండి...'

'బహుశా యివ్వాళ తెలిపోవచ్చు. ఈసారి ధోకా లేదు. ప్రమోషన్ వచ్చి తీరుతుందనుకో ... ఇదిగో సునీతా నువ్వు మనస్సులో యేమీ పెట్టుకోవద్దు. నాకు ఆవేశం వచ్చినప్పుడు ఏదో అంటాను. అంతే మళ్ళీ మరుక్షణంలో నా మనస్సులో యేమీ వుండదు...' నవ్వాడు మోహన్.


'ఇలాంటి ఆవేశాలు కేవలం మీకే పరిమితం కావుగా...' హాయిగా నవ్వేసింది సునీత.

.........

'పాపం పూర్ హజ్బెండ్...అంతా ఆయన తెలివితేటలవలనే అనుకుంటున్నారు. మా నాన్న, ఆ బెనర్జీగారితో చెప్పి చేయించకపోతే ఈయనగార్కి ప్రమోషన్ వచ్చేదేనా! ఈ మాటే పైకి అంటే యింకేమన్నా వుందా కొంపలు అంటుకుంటాయి. శక్తికి మించిన తామసం:... అవును కష్టపడి పనిచేయటం మంచిదే. తన స్వశక్తి మీద ఆధారపడటం అంతకంటె మంచిదీ ఎవరు కాదంటారు! అయితే మా వాళ్ళు సహాయం చేస్తానంటే వద్దంటం యెందుకు! ఆత్మాభిమానం దెబ్బతింటుంది. ముక్కూ మొహం తెలీనివాళ్ళదగ్గరకు వెళ్ళి దేబరించటం కంటె. అయినవాళ్ళు సహాయం చేస్తానంటే తీసుకోవటంలో తప్పేముంది! అయినా మావాళ్ళు కూడా కొంచెం మోతాదు మించి మాట్లాడతార్లే. ఎదుటివాళ్ళంటే గడ్డిపరకతో సమానంగా చూస్తారు! అసలయినా ఆయనంటె అంత అలుసెందుకో. పెద్ద శ్రమ లేకుండా చెయ్యదలుచుకున్న సహాయం ఏమిటో గుట్టుచప్పుడు గాకుండా చేస్తే సరిపోలా! ప్రతి చిన్న విషయం టాంటాం చెయ్యటం చివరకు ఆయనకు కోపం రావటం. ఈ రోజుల్లో సంపాదనకోసం అందరూ తపనపడిపోతున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ సంపాదిస్తున్నా సరిపోవటంలా. ఓవర్టైం అని, పార్టుటైం అని నానా అవస్థ పడుతున్నారు. ఇరవై నాలుగు గంటలూ డబ్బుగా మార్చెయ్యాలని తపనపడిపోతున్నారు. ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. ఇలాంటప్పుడు మా వాళ్ళు నాలుగు రూపాయలు నాకిస్తే ఆ డబ్బు మనకొద్దని, యేమైనా వస్తువులు కొని యిస్తే, వాళ్లకు తిరిగి యిచ్చేసెయ్యటం ఏమిటి యిదంతా...

అవును మావాళ్లదగ్గర బడాయి ఎక్కువే. కాస్తంత చేస్తే గంపంత చెపుతారు. అందరికీ తెలియాలి. మొన్న పరకు మొన్న కలర్ టి.వి.కి యెంత రాద్ధాంతం అయింది. అల్లుడికి జీతం తక్కువే గదా ఆయనెట్లాగూ కొనలేడు అని మేమే కలర్ టి. వి. కొని మా అమ్మాయిచేత పంపించాం అన్నారు మావాళ్ళు. దాంతో రగుల్కుంది. అప్పటి నుంచి మావాళ్లంటే అసలు గిట్టకుండా పోయింది. వాళ్లదగ్గర్నుంచి ఏ రూపంగానైనా సరే మనకు సహాయం రాకూడదు అని ఆయన పట్టుదల, వాళ్ల ఛాయంటే సరి మరీ పొక్కకుండా పోయింది.

అందుకనే మా వాళ్ళచేత పట్టు వేయించుకున్నా, వాళ్ళేంచేసినా, మూడో వాడికి తెలీకూడదు. ఆ షరతుమీదే మా



నాన్నగారు బెనర్జీగార్కి రికమెండ్ చేసి ఆయనకు ప్రమోషన్ యిప్పిచటం యెవ్వరికీ తెలీదు. ప్రమోషన్ రాగానే అది ఆయన ఘనతే అని పొంగిపోతూ యింటికి వస్తారు. తన గొప్పతనాన్ని, తన ప్రయోజకత్వాన్ని చెప్పటానికి ఆయనకు మాటలు చాలవు...' తనను తాను తర్కించుకుంటూ సునీత, భర్త రాకకోసం యెదురు చూస్తోంది.

'అదుగో ఆ స్కూటర్ చప్పుడు ఆయనదే. ఆగింది కూడా... ఇప్పుడు ఎదురుగా వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి. నాకేమీ తెలియనట్టుగానే వుండాలి. నా ప్రవర్తన మూలాన ఆయనకు ఏ విధమైన అనుమానం రాకూడదు. అసలే అనుమానం మనిషి. అయినా నేను ఎదురు వెళ్ళటం యెందుకు. ఇక్కడే కూచుంటా మెదలకుండా. ఆయన వచ్చిన తర్వాత ఆ ఆవేశం యేమిటో చూసి అప్పుడే నేను ఉత్సాహం చూపిస్తే సరిపోలా...' సునీత స్వగతంలో యెన్నో అనుకుంటోంది.

'సునీతా... నువ్వన్నట్టే అయింది, గుడ్ న్యూస్... నీ కెట్లా తెలుసు ప్రమోషన్ వస్తుందని...' మోహన్ ఎగిరి గంతేశాడు యింట్లోకి.

సునీత గతుక్కుమంది.

'చచ్చాంరా బాబు... కొంపతీసి నా మీద నిజంగా అనుమానం రాలేదుగదా. ...అనుకుంటూ బిగ్గరగానే, 'ఏమిటి... ప్రమోషన్ వచ్చిందా.' కంగ్రాట్స్... మోహన్‌ను చుట్టేసుకుంది సునీత.

'ఇవ్వాళ బెనర్జీగారు నన్ను ఎంత పొగిడేశా రనుకున్నావ్...' నన్ను సెక్షన్ యిన్‌ఛార్జి చేసేశారు అప్పటి కప్పుడే ఇహనుంచి టెండర్స్, కొటేషన్స్‌లో నన్నే కన్సల్ట్ చేస్తారట ఇప్పటినుంచి మనం కూడా ఒక 'బాస్' అన్నమాట...' మోహన్ గర్వంగా చెపుతున్నాడు.

'ఇప్పుడు మాత్రం కాదేంటి...' సునీత హాయిగా నవ్వేసింది.

'అవుననుకో... ఇవ్వాళ్టినుంచి ఆఫీసులో కూడానూ' మోహన్ కూడా సంతృప్తిగా నవ్వాడు.

'సునీతా.. ఇప్పుడు జీతం, ఎలవెన్స్‌లు అన్నీ కలిపి మూడువేలదాకా వస్తుంది..'

'అయితే యీ నెల పట్టుచీర కొంటా రనమాట...'

'తప్పకుండా... అసలు పాపం నీకు పట్టుచీరలు బొత్తిగా లేవేను...'

'నాకు యెన్నివుంటే మీ సంపాదనలో కొన్న పట్టుచీర విలువ మిగతావాటికి యేముంటుంది..' ఈ విషయంలో యీ మాత్రం పొగడటం అనుచితం కాదని పించింది సునీతకు

'అట్లా రా దార్లోకి ద టీజ్ ద పాయింట్...'

'అమ్మయ్య యిప్పటికి దార్లో పడ్డట్టు కనిపిస్తోంది...' సునీత పెద్దగా నిట్టూర్చింది.

ప్రతి రోజూ ఆఫీసులో జరిగిన విషయాలన్నీ సునీతకు పూసగుచ్చినట్టు చెపుతున్నాడు. ప్రతి మాటలోనూ తన ప్రతిభ, తన చాకచక్యం, తన గొప్పతనాన్నే పొగడేసుకుంటున్నాడు. వింటానికి విసుగ్గా వున్నా, తప్పనిసరిగా ఓపిక పట్టుతోంది. సునీత. మధ్యలో యేమన్నా అంటే ఆయన మూడ్ యెక్కడ మారిపోతుందో అన్నట్టుగా చెప్పిన వాటన్నింటికి తల వూపుతోంది శభాష్ అన్నట్లు. మధ్య మధ్యలో నవ్వు అరువు తెచ్చుకుంటూ.

ఆనాడు యింటికి వస్తూనే మోహన్ కొంచెం గంభీరంగా అన్నాడు.

'ఇప్పటికి షుమారు ఏడాది అవుతోంది. యీ కొత్త పోస్టులోకి వచ్చి ఇంకా బాధ్యతలు పెరిగిపోతున్నాయి. మా కంపెనీవారు ఓ పెద్ద ప్రాజెక్ట్ తీసుకున్నారు. ఆ వర్క్ షాప్ కన్‌స్ట్రక్షన్‌కు రెండు కోట్లు అవుతాయని అంచనా. దాన్ని స్టడీ చెయ్యటానికి నన్ను కలకట్టా పంపిస్తున్నారు. మినిమమ్ పదిహేనురోజులుండాల్సి వస్తుంది...'

'పదిహేనురోజులే... అయితే నేనూ వస్తా... కలకత్తా నేనసలు చూళ్ళేదు ...' సునీత గభాలున అన్నది.

'మొదట్లో అవుతే నేనూ అట్లాగే అనుకున్నా. కాని నేను అక్కడ మీటింగ్స్‌కు వెళ్ళాలి. ఫ్యాక్టరీ సైట్ చూడాలి. ఒక్కచోట కూచుంటే సాగదు. తిరుగుతూ వుండాలి. నువ్వు మరి ఒంటరిగా రూమ్‌లో కూచుంటే యేం తోస్తుంది...'

సునీత క్షణం పాటు మౌనం వహించింది.

'ఈ వారంలోనే వెళ్ళాలి' అన్నాడు మెల్లిగా మోహన్.

సునీత యేమీ మాట్లాడలేదు.

'నాకూ యేమీ తోచటం లేదు. ఏం చెయ్యాలో... అయితే ఓ పని చెయ్యరాదు. ఈ పదిహేను రోజులు మీ వాళ్ళింటికి వెళ్ళరాదు.'

సునీత అప్పటికీ యేమీ అనలేదు.

'ఏం నీ కిష్టంలేదా!...'

సునీత నవ్వింది.

మోహన్‌కు అర్థంకాలేదు.


'అట్లాగే వెళ్తాను...' సునీత మొహం విప్పారింది.

మోహన్ మధ్యాహ్నం కలకత్తాకు బయలుదేరాడు. ఆ సాయంత్రమే సునీత హైదరాబాదు వచ్చేసింది.

'అమ్మాయి వచ్చింది... ఎంతో సంతోషంగానూ, ఆప్యాయంగానూ శారదాదేవి అన్నది.

మేడమీదనుంచి దిగివస్తూనే 'కులాసాగా వున్నావా అమ్మాయి' అన్నాడు హుందాగా నారాయణరావు.

తండ్రి మొహంలోకి చూస్తూనే సునీత వెనక్కు తగ్గింది.



'ఆ...' అన్నది చాలా నెమ్మదిగా.

'అల్లుడెట్లా వున్నాడు...' నారాయణ రావు రెండో ప్రశ్న.

'మధ్యాహ్నమే కలకత్తా వెళ్ళారు ఆఫీసు పనిమీద...' సునీత తండ్రి మొహంలోకి సూటిగా చూసింది.

'అట్లాగా...' అంటూనే నారాయణ రావు తల వూపుతూ ముందుకు రెండడుగులు వేశాడు.

సునీతకు ఆశ్చర్యం వేసింది. తన తండ్రి అంత ముభావంగా వుండటం అదివరకెప్పుడూ చూడలేదు.

ఆ సాయంత్రమే తల్లిని అడిగింది.

శారదమ్మ తన ఆవేదనంతా కూతురుతో చెప్పటానికి మొదట్లో సంకోచించినా, చెపితేనే మంచిదనుకుంది, తర్వాత.

అల్లుడికి ప్రమోషన్ యిప్పించినప్పటి నుంచి, అతని ప్రవర్తనే ఆదోరకంగా మారిపోయిందట. ఎవ్వర్నీ లెక్కపెట్టటం లేదుట. అందర్నీ నిర్లక్ష్యంగా చూట్టం, తనకు ఏది తోస్తే అది చెయ్యటం, చివ్వరకు బెనర్జీగార్కికూడా విసుగుపుట్టిపోయిందిట. అసలు మీ నాన్నగార్నే నలుగురి ముందర ఇన్‌సల్ట్ చేశాట్ట. ఏమన్నాడు, ఏం జరిగింది చెప్పమని ఎన్నిసార్లు అడిగినా మీ నాన్నగారు చెప్పటంలేదు తీవ్రంగా బాధ పడుతున్నారు. ఆందోళనగానూ బాగా కోపంగానూ వున్నారు. అంత చెయ్యరాని పని ఏం చేశాడోయేమో! ఇప్పుడు నాన్న గారి మనస్సులో ఒకటి పడిపోయింది. సహాయం అనేది అడుగుతే చెయ్యాలి గాని తనంతట తాను చేస్తే దానికేమీ విలువ వుండదని. ఇప్పుడు అల్లుడు విషయంలో అదే జరిగిందని. అందుకని మళ్ళీ అల్లుణ్ని అదివరకు పోస్ట్‌లోకి రివర్ట్ చేసి తీరుతానని పట్టుదలతో వున్నారు. నా మాట వినేటట్లు లేరు. నువ్వనా చెప్పమ్మా...' శారదదేవి తొట్రు పడుతూ ఆదుర్దాగా అన్నది.

'నేనా......' సునీత వికటంగా నవ్వింది.

'ప్రతి తల్లితండ్రులు కూడా పిల్లల యోగక్షేమాలు కోరుకుంటారు. దానికి తగినట్లుగా వాళ్ళు యేవేమో చేస్తారు. కాని పిల్లల అదృష్టాలకు తల్లితండ్రులు బాధ్యులు కారమ్మా, ఈ విషయం నే నిప్పుడే తెలుసుకున్నాను...' హుందాగా అన్నది సునీత.

శారదాదేవి బిత్తరపోతూ కూతురి వంక ఆశ్చర్యంగా చూస్తోంది.

సునీత అక్కడున్న పదిరోజుల్లోనూ, నారాయణరావు చాలా ముభావంగానూ వున్నాడు. ముక్తసరిగానే మాట్లాడాడు.

ఒకటి రెండుసార్లు మాత్రం కూతురి దగ్గర మాట్లాడుతూ ఆఫీసు విషయాలు యేమన్నా చెపుతుందేమోనన్నట్టుగా, ఎదురుచూశాడు. తన తండ్రి, ఆఫీసులో అల్లుడి విషయం గురించి ఏమన్నా ప్రస్తావిస్తాడేమో అన్నట్టు నిరీక్షించింది. కాని యిద్దరు నిరుత్సాహపడిపోయారు. సునీత అవుతే యెంతో బింకంగానూ గంభీరంగానూ వుండిపోయింది. నిజానికి నారాయణరావుకు ఆశ్చర్యంగానే వుంది. కాని పైకి యేమీ అనలేదు. శారదాదేవి మాత్రం అటు భర్తకు గాని యిటు కూతురికి గాని యేమీ చెప్పలేక తనలో తాను బాధపడింది నిశ్శబ్దంగా.

వెళ్ళొస్తానన్న అన్న సునీత మాటలకు సమాధానంగా 'మంచిదమ్మా' అన్నాడు నారాయణరావు.

శారదాదేవి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినాయి.

మోహన్ ఉత్సాహానికి ఆనందానికి అంతులేదు. కలకత్తాలో ఆయన చేసిన ఘనకార్యాలన్నీ చెప్పటంతోనే ఓ వారం గడిచిపోయింది. సునీత కపుడే గుండె దడదడమంటూనే వుంది.

ప్రతి సాయంత్రం భర్తవచ్చే వేళ్టకి వాకిటి గదిలో కూర్చుని కిటికీలోంచి తొంగిచూస్తూ వుంటుంది, భర్త మొహంలో యేమన్నా మార్పు వుందా అని. ప్రతి రోజూ కూడా మోహన్ ఉత్సాహంతో ఉరకలెత్తుతూ వస్తూ వుంటే, గుండె మీద చెయ్యివేసుకుని అమ్మయ్య అని పెద్ద నిట్టూర్పు విడుస్తూ వుంటుంది సునీత.

ఆ సాయంత్రం కూడా రోజు మాదిరిగానే గది కిటికీలోంచి సునీత తొంగి చూస్తోంది.

మోహన్ కసిగానూ కోపంగానూ స్కూటర్ స్టాండ్ వేసి, విసురుగా లోపలికి వచ్చేశాడు. అటూ యిటూ చూశాడు.

ఏమీ తెలియనట్టుగా గదిలో కుర్చీలో కూర్చుని పుస్తకం చేతపట్టుకుని వుంది సునీత.

హఠాత్తుగా మోహన్ గది గుమ్మం దగ్గరకు వచ్చాడు.

రెండుచేతులూ దర్వాజాకు అడ్డంగా పెట్టి కనుబొమ్మలు ఎగరేస్తూ, బుసలు కొడుతూ 'సునీతా!' అంటూ బిగ్గరగా అరిచాడు మోహన్.

సునీత ఉలిక్కిపడి లేచి నిలబడింది.

ఏమిటండీ ... అన్నట్టు చేతులు వణుకుతూ, కనుబొమ్మలు దగ్గరకు తీస్తూ, అడుగులో అడుగు వేసుకుంటూ కొంచెం ముందుకువచ్చి నిలబడింది మోహన్ కళ్ళల్లోకి చూస్తూ.

'జయం మనదే!...' అన్నాడు సగర్వంగా మోహన్.

సునీత బిత్తరపోయింది.

'ఆ బెనర్జీగారు నాకు ప్రమోషన్ యివ్వటానికి కారణం, మీ నాన్న రికమెండేషన్ అని ఆనాడే నాకు తెలుసు... కాని నేను అది ఛాలెంజ్‌గా తీసుకున్నాను. నా వర్తు ఏమిటో బెనర్జీగారు తెలుసుకున్నారు. నన్ను చేరదీశారు. నా వలన కంపెనీకి బాగా లాభాలు వస్తున్నాయని గ్రహించారు. అందరూ నన్నే పొగట్టం మొదలెట్టారు. మీ నాన్న అహం బాగా దెబ్బతిన్నది. నన్నెట్లాగైనా యీ పోస్ట్‌లోంచి తీసెయ్యాలని ఎంతో ప్రయత్నం చేశాడు. బెనర్జీగారి పైఅధికారితో కూడా చెప్పించాడు. ఆ అటలు సాగలేదు, మా కంపెనీకి ఉపయోగమైన వ్యక్తిని మేము పోగొట్టుకోలేము అని సూటిగా మీ నాన్నకు సమాధానం వచ్చింది. ఇప్పుడన్నా నేనెవరో తెలుసుకున్నావా!' మోహన్ చెపుతున్న ధోరణిలో ఆ తీవ్రతను. ఆ ఆవేశాన్ని తట్టుకోలేకపోయింది సునీత.

మూర్ఛవచ్చినంత పనయింది. వళ్లు తూలుతోంది. అమాంతం సునీతను దగ్గరకు తీసుకుని, 'మీరెప్పుడూ రారే మావాళ్ళింటికి అంటూ వుంటావుగా, ఇప్పుడు సమయం వచ్చింది. ఇవ్వాళే వెళదాం' అన్నాడు మోహన్.

తన భర్త శక్తిసామర్థ్యాల్ని తక్కువ అంచనా వేసుకున్నందుకు పశ్చాత్తాపపడుతోందో, లేక తన తండ్రి ఎట్లా వున్నాడో చూద్దామనే ఆవేదనతో బాధపడుతోందో యేమో సునీత నోటినుంచి మాట పెగిలిరాలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ మోహన్ను చుట్టేసుకుంది.

*With best compliments from*

PHONE : 276 & 1971

SRINIVASA CHIT FUND COMPANY

Kandukuri Veeresalingam Street,

24/A, 13-9, ASHOK NAGAR,

**E L U R U - 534 002.**